# తప్పులు త్యాగాలు



## కంఠంనేని రాధాకృష్ణమూర్తి

విద్యాపతి ఎటో పారిపోయాడని ఎవరో అంటే నాకు నమ్మబుద్ధి కా లేదు. ఆశ్చర్యమేసింది. నిజానికి అతనట్లాంటి మనిషి కాడు. అతనికా అవసరమూ లేదు. బీదవాడే గాని...

విద్యాపతి మాఆఫీసులో ఒక ఎల్డీసీ. మనిషి సాత్వికుడు. పొట్టిగ, బక్కగఉంటాడు అయిదడుగుల నాలుగంగుళాలు. ఇరవై నాలుగేళ్ళు. అతని దుబ్బు కనబొమల క్రింద కళ్ళు పేలవంగా చూస్తుంటాయి. నెత్తిమీద అంట కత్తిరించిన జుట్టుతో సదా తెల్లటి పైజమా, ఇద్దరు లాల్చీల్లో ఉండేవాడు. చూసే వాళ్ళకు అతనిలో ఏ ప్రత్యేకతా ఉన్నట్లు అనిపించదు, యమ్మే లిటరేచర్‌తో పాసయ్యాడు. మనుషుల్తో అతను చాలా తక్కువగా మాట్లాడతాడు. తన పనేదో తాను చేసుకుపోతుండేవాడు. ప్రసంగాల్లో ఎవరితోనైనా ఉద్రిక్తస్థితి ఏర్పడేట్లుంటే మఘనంగా అక్కణ్ణించి తప్పుకుపోయేవాడు. మా ఆఫీసులో అందరూ అతణ్ణి 'పిరికివాడు' అనేవాళ్ళు. పాపమతను ఎవరికీ ఏనాడూ అపకారం తలపెట్టినవాడు. కాకపోయినా కొందరు అతన్ని గురించి 'నల్లి' అని కూడా అనేవాళ్ళు. మా ఆఫీసులో పనిచేసిన యాడాదికాలంలోనూ అతనితో నాకంతగా స్నేహం ఏర్పడలేదు. నిజం చెప్పాలంటే అందరితో పాటు నేను

ండా అతనిమీద ఒక విధమయిన అయిష్టాన్ని ఏర్పరచుకున్నాను.

“కాని నువ్వతనితో ఒకసారి మాట్లాడి చూడు, తప్పకండా ఇంప్రెస్ అవుతావు,” అన్నాడు మా రాఘవయ్య ఓసారి. బుజాలెగరేసి ఊరుకున్నాను.

నేనట్లాంటి ప్రయత్నమేదీ చేయకుండానే అతనోసారి వెతుక్కుంటూ నా గదికి వచ్చాడు.

“మీ దగ్గరేవో పుస్తకాలున్నాయని విన్నాను” అన్నాడు.

ఏం కావాలి మీకు?”

“ఏమున్నాయి మీ దగ్గర?”

చెప్పాను.

“అవా, ఫిక్షన్‌వి కావండీ, ఫిలాసఫీ వేమైనా ఉంటే...” అన్నాడు.

“రూసో, నీచే, మార్క్స్ ఎంగెల్స్, ఇట్లాంటి వారివెవరివైనా.”

“క్షమించండి,” అన్నాను.

“థాంక్సండీ.” అని చెప్పి అతను వెళ్ళిపోయాడు. నాకు చాలా ఆశ్చర్యమేసింది. అంతనెంత నిర్లిప్తంగా వచ్చాడో అంత నిర్లిప్తంగానూ వెళ్ళిపోయాడు. నా వద్దకొచ్చేటప్పుడు ఆశతో వచ్చినట్లు కనిపించలేదు. నానుండి వెళ్ళిపోయేటప్పుడు నిరాశతో వెళ్ళినట్లూ అనిపించలేదు. ఈ మధ్య సమయంలో నాతో ఎక్కువ తక్కువగా మాట్లాడలేదు కూడా. మనుషుల్లో, అందులోనూ అంత తక్కువ వయసున్న వాళ్ళలో అట్లాంటి బాలెన్స్‌డ్ మెంటాలిటీ సాధ్యమా అనిపించింది...

అందుకే విద్యాపతి పారిపోయాడంటే నాకాశ్చర్యమేసిందన్నది! ఎటు పారిపోయాడు?” ఎందుకు పారిపోయాడు? జీవితంలో ఓడిపోయా? లేక ఏ సుఖాన్నన్నా వెంట వేసుకునా??

ఓ రెండు రోజుల తర్వాత అతని కుటుంబానికి సంబంధించిన మనిషెవరో మా ఆఫీసుకు వచ్చి ఎంక్వయిరీ చేస్తే నాకు నమ్మక తప్పలేదు. అతనికిద్దరు పిల్లలు. చక్కటి భార్యఅట అతనికొచ్చే మూడు వందల తాలూకు జీతంతోనూ అతను వీళ్ళనే కాక పక్షవాతంలో మంచానపడి ఉన్న తల్లిని, పెళ్ళీడు కొచ్చిన ఒక చెల్లెల్నీ, చదువుకుంటున్న ఇద్దరు తమ్ముళ్ళనీకూడ పోషించాలి. వాళ్ళకు వేరే ఆధారమేదీ లేదట. అయితే అతను వాళ్ళందర్నీ పోషించలేక పలాయనం చిత్తగించాడా?! దూరదేశంలో ఎక్కడన్నా ఆత్మహత్య చేసుకున్నాడా??...ఇవన్నీ నా అంచనాలు మాత్రమే. అసలు సంగతి మా రాఘవయ్యకు తెలుసుననిపించింది. వాళ్ళిద్దరూ చాలా స్నేహంగా మెలిగే వాళ్ళు.

వారే రాఘవయ్యా, అతనెక్కడికి పోయాడో నిజంగా నీకు తెలియదా?” అడిగాను.

నీ మీద ఒట్టు, నాకు తెలియదు ”

“పోనీ ఊహించగలవా?”

కన్నింగ్‌గా నవ్వాడు వాడు

“అట్లా అంటావూ, చెప్పగలను.”

“చెప్పు!”

విప్లవాదుల్లోచేరి ఉంటాడు.

ఉలిక్కి పడ్డాను.

“నిజం?”

“ఊహిస్తున్నాను మాత్రమే సుమా!”

“ఒకటి నిజం,” రాఘవయ్య మళ్ళీ అన్నాడు. “అతను ఎస్కేపిస్టు కాడు. ఈ సమాజం మారాలనే వాడు. మారుతుందనే

వాడు. ఆ ఆశ అతనిగుండెల్లో ఏనాడూ ఇంకి పోలేదు. అయితే అందుకు పేద ప్రజల, కార్మికుల, కర్షకుల పిడికిళ్ళన్నీ ఏకం కావాలంటాను."

"వాండర్!!" అన్నాను.

విద్యాపతి వాడే పదాల్లో బూర్జువాలు, ప్రొలిటేరియన్లు, వర్గపోరాటం, సమసమాజం, ఇట్లాంటివి తరచుగా దొర్లుతుండేవి.

"మన సమాజంలో ఎక్కడో లోపముంది," రాఘవయ్యతో అతనన్నాడోసారి. "బహుశా అది ప్రజాస్వామ్యంవల్ల కావచ్చు. మన ప్రభుత్వమే ఒక పెట్టుబడి దారుల గుంపు. అది సాగించే వ్యాపారంలో మేధావి వర్గం-అంటే డాక్టర్లు, ఇంజనీర్లు, లాయర్లు, సైంటిస్టులు, కవులు, వీళ్ళంతా - డబ్బుకు అమ్ముడుబోయి, ఉత్త కార్మికుల క్రిందికి మారుతున్నారు. ఇదిట్లా సాగకూడదు..."

"మరెట్లా సాగాలంటారు?" అడిగాడు.

"మనిషికి అర్హతను బట్టీ, చేసిన కృషి బట్టీ సౌకర్యాలు లభించాలి. నిజానికి ఇవాళట్లా జరుగుతోందంటారా? లేదు. ఒకడి అదృష్టం బాగుండి వాడి తల్లిదండ్రులు ధనికులైతే వాడెంతటి అర్హతలేని వాడైనా, ఎంతటి క్రూర అయినా పెట్టుబడిదారై కూర్చుని సుఖపడుతున్నాడు. మరొకడు ఎన్ని అర్హతలు కలిగినవాడై ఉన్నా కూడా తను కేవలం పేదవాడి కడుపున పుట్టిన కారణంగా అవకాశాలు కోల్పోయి శ్రమజీవి క్రింద మారి కష్టాలనుభవిస్తున్నాడు ... కార్మికుడు చేసిన కష్టాన్ని అమ్ముకుని లాభాల క్రిందికి, సుఖాల క్రిందికి మార్చుకుంటున్నాడు పెట్టుబడిదారుడు. ఫలితంగా ఈ శ్రమజీవికి లభిస్తోంది ఇన్ని కూలి డబ్బులు మాత్రమే. మళ్ళీ ఈ కూలి డబ్బుల్ని కూడా బజార్లో వర్తకులు దోచుకుంటున్నారు


## వచ్చేవారం

- ఏరీ మన కుస్తీవీరులు? (విశేష రచన) — ఆర్డీ చలం
- జులుం (కథ) — నిష్ఠల వెంకటరావు
- గుండె మంటతో చలి (కథ) — కొంపెల్ల విశ్వం
- బరువెక్కిన పూలు (కథ) — శీలా సుభద్రాదేవి
- సైన్సు సినిమాల సంగతి —శ్రీకాంత్
- సావేరి • అనంతం • రాజు—పేద
- సినీతంత్ర • బాలతంత్ర

ఇంకా ఇతర ఆకర్షణలు

రూపాల్లో. ఇట్లా ఏవిధంగా చూసినా వుతోంది ప్రొలిటేరియన్లు, బాగుపడు వాళ్ళు బూర్జువాలు, వాళ్ళ ప్రభుత్వ లనూ ..."

"అయితే దీనికి మార్గమేమిటంటారు ?" రాఘవయ్య అడిగాడు.

"ఆస్తి హక్కునీ, వారసత్వ హక్కునీ రద్దు చేయొచ్చు!"

"కాని సాధ్యమా?"

"ఎందుకు కాదు?"

"ఎట్లా?"

"ఎరుపు - "ఎరుపు" ద్వారా!!"

విద్యాపతి కళ్ళలో ఒక్క క్షణం ఎర్రదనం మెరిసి మాయమయ్యింది.

"ఇప్పుడేమంటావు?" అన్నాడు రాఘవయ్య.

"నువ్వు చెప్పింది నిజమే కావచ్చు."

అలా పారిపోయాడు అనుకోబడ్డ యాడాదిన్నర తర్వాత అనుకోకుండా ఒకసారి విద్యాపతి నాకు తటస్థపడ్డాడు. అప్పుడు నేను ఉద్యోగం ఊడిపోగా మా ఊళ్ళోనే ఉంటున్నాను.

మా ఊరు పక్కనుంచి ఒక తారు రోడ్డు పోతుంది పట్టణానికి. మేము కాలవకి వెళ్ళాలంటే దాన్ని దాటిపోవాలి. ఆనాడు ఉదయం ఆ రోడ్డును దాటుతున్న నాకు కాస్తదూరంలో ఒంటరిగా నడుస్తూ వస్తున్న ఒక బాటసారి కనిపించాడు. అతని బట్టలు బాగా మాసి అక్కడక్కడా చినుగులు పట్టి ఉన్నాయి. అతని బుజాన గోనె పట్టాతో చేయబడ్డ సంచి ఒకటి బరువుగా వ్రేలాడుతోంది. మనిషి చాలా బలహీనంగా ఉన్నాడు. అతణ్ని ఎక్కడో చూచినట్లనిపించింది నాకు.

"విద్యాపతిగారూ!" చప్పున అన్నాను.

ఒక్క క్షణం అతను బిత్తరపోయి చూశాడు.

"ఓ మీరా, మీరా!" అన్నాడు కంగారుగా.

"ఏం చేస్తున్నారిప్పుడు?" అడిగాను చటుక్కున జవాబిచ్చాడతను.

నాకు నవ్వాలనిపించింది. అతని అవతారం చూస్తూ అతను చెప్పింది ఎవరూ నమ్మలేరు.

"మా ఇంటికి వెళ్దాం పదండి," అన్నాను సభ్యతగా.

కొద్దిసేపుయోచించి, "పదండి" అన్నాడు.

కాఫీ త్రాగాక అతను చిన్నగా నవ్వుతూ అన్నాడు.

"నేను చెప్పింది మీరు నమ్మలేదు కదూ?"

"నేనే కాదు, ఎవరూ నమ్మరనుకుంటాను."

అతని గడ్డం మీసాలు బాగా పెరిగి ఉన్నాయి. కళ్ళు లోతుకు పీక్కుపోయి ఉన్నాయి.

"అవునూ, మీరట్లా అర్థాంతరంగా ఉద్యోగాన్నొదిలి పెట్టి ఎందుకు వెళ్ళినట్టు?" అడిగాను.

అతను జవాబు చెప్పలేదు.

"మీరింకా ఉద్యోగంలోనే ఉన్నారా?" ఎదురు ప్రశ్న వేసాడు.

"లేదు రిట్రెంచిమెంటు!"

"అయితే మీకు చెప్పవచ్చనుకుంటా... మా సానుభూతిపరులే అయుంటారు" అన్నాడు.

"అర్థమయింది!"

కాసేపు ఎవరమూ మాట్లాడుకోలేదు.

"మీ తల్లి చనిపోయిందట తెలుసా?" కావాలనే సడన్‌గ అన్నాను.

అతని మొహంలో విషాదచ్ఛాయలు కని పిస్తాయనుకున్నాను కాని—

"తెలుసు," అన్నాడు నిర్లిప్తంగ.

"ఆమె చనిపోయింది మందులు లేక, మందులు కొనటానికి డబ్బులు లేక డబ్బు లందించటానికి చేతికి అంది వచ్చిన కొడుకు దగ్గరలో లేకపోవటంవల్ల - అలా అని విన్నాను," ఈసారి కాస్త కఠినంగా అన్నాను.

మాట్లాడలేదతను.

"ఫీజు కట్టలేక మీ తమ్ముళ్ళిద్దరూ చదువు మానేసారట. ఇల్లు గడపటానికి ఒకతను బస్టాండులో బరువులు మోస్తున్నా డట."

చిన్నగ నవ్వాడు విద్యాపతి.

"మీరిదంతా ఎందుకు చెబుతున్నారో నాకు తెలుసు," అన్నాడు.

"నా కాశ్చర్యంగా ఉంది, ఏ ఆదర్శం కోసం మీరిలా స్వంత వాళ్ళని బలి చేసు కుంటున్నారో..."

"నేను, నా వాళ్ళు' అన్నవాటిని వొదులు కోనంత కాలమూ ఇట్లాంటివి అర్థం కావండీ."

"కాని ప్రజల్లో కూడా మీ గురించి దౌర్జన్యపరులు, దోపిడీగాళ్ళు అన్న భావం వదలలేదు తెలుసా?"

బుజాలెగరేసాడు విద్యాపతి.

"ఎవరో ఏమో అనుకుంటున్నారను కుంటూ కూర్చుంటే మనం లక్ష్యంవేపు ప్రయాణించలేమండీ ఆలోచించాల్సిందల్లా మనం చేస్తోంది తప్పా రైటా అన్నది మాత్రమే."

"అయితే మీరు చేస్తోంది తప్పుకాదనే మీ విశ్వాసమన్నమాట?"

"ఆహా!"

ఇంక అతనితో ఆ ధోరణిలో మాట్లాటం అనవసరమనిపించింది. ఆ పూట భోజనం అతనికి మా ఇంట్లోనే అరేంజ్ చేయించాను. అతను సభ్యత కూడా మర్చిపోయి ఆవురావురమంటూ భోంచేస్తుంటే నాకు జాలేసింది.

"విద్యాపతిగారూ, మీరు భోజనం చేసి ఎన్నాళ్ళయి ఉంటుంది?" చనువుగా అడిగాను.

"మూడు రోజులు" చాలా మామూలుగా జబాబిచ్చాడు.

"ఏం బావుకుంటున్నారని ఇప్పుడు, లక్షణంగా ఉద్యోగం చేసుకోక!" అన్నాను జాలిగా.

విద్యాపతి కొద్దిసేపు మాట్లాడలేదు. తర్వాత నిదానంగా అన్నాడు.

"వియత్నాం యుద్ధంలో 'ఆత్మాహుతి దళాలని' కొన్ని కమ్యూనిస్టు దళాలున్నాయండీ. వాళ్ళ పనల్లా మందు గుండు సామగ్రి నింపుకున్న విమానాల్లో వెళ్ళి సూటిగా శత్రు స్థావరాల మీద పడిపోవటమే! వాళ్ళకు ముందే తెలుసు, తామెటూ చనిపోబోతున్నామని. అట్లా ... ఒక లక్ష్యంకోసం పనిచేస్తున్నప్పుడు కొన్ని కష్టాలు, త్యాగాలు బలులు తప్పవు...మనదేశంలో ఎంత మంది జనం రోజుకు ఒక్కసారయినా కనీసం ఇంత అంబలి దొరక్క ఎట్లా అలమటిస్తున్నారో మీకేం తెలుస్తుంది..."

ఆ తర్వాత విద్యాపతి తరచుగా మా ఇంటికి రావటం మొదలెట్టాడు ఎక్కడుండేవాడో, ఎక్కడెక్కడ తిరుగుతాడో తెలియదు. హటాత్తుగా ఊడిపడేవాడు సాయంత్రం మునిమాపు వేళ.

సీ అయి డీ ల్లాంటి వారెవరూ తిరగటం దుకదా?'' అడిగేవాడు ప్రతిసారీ సందేహంగా.

ఒకసారి వాళ్ళ కార్యకలాపాల గురించి అడిగాను.

''వర్గ పోరాటానికి ప్రజల్ని సమాయత్త పర్చటం! తక్కువ కులాల వాళ్ళలోనూ, కూలి వర్గంలోనూ వాళ్ళకు జరుగుతున్న అన్యాయాల్ని వివరించి, అందుకు కారకుల్ని కారణాల్ని చూపించి, వాళ్ళలో పేరుకున్న మత్తును, మందకొడితనాన్ని విదిల్చి, వాళ్ళలో విప్లవ బీజాల్ని నాటటం, అందుకు వాళ్ళను సిద్ధపర్చటమూ...''

''అంటే ప్రభుత్వాన్ని పడగొట్టటానికి ప్రయత్నాలన్నమాట''?

''ఒక విధంగా అంతే... కాని ప్రభుత్వమంటే ఇప్పుడున్న ప్రభుత్వమనీ కాదు ఈ ప్రజాస్వామ్యాన్నే, ఈ దోపిడీ తత్వాన్నే మొదలంటా నరికేయాలి! ఏ మనిషి కూడుకీ, గుడ్డకీ వెతుక్కోవాల్సిన అవసరం రాకూడదు. ఎవడికీ నేరం చేయాల్సిన అగత్యం ఏర్పడకూడదు. ప్రతి మనిషీ శ్రమించాలి. కనీసావసరాలకోసం దిక్కులు చూడాల్సిన గతి పట్టరాదు. అట్లాంటి ప్రభుత్వం కోసం!''

''కాని నాదో సందేహం,'' నేనన్నాను. అట్లాంటి ప్రభుత్వం కోసం మీరు విప్లవాన్నే ఎందుకు ఆదర్శంగా చేసుకోవాలి?? ప్రజల్లో మీ ఆదర్శాల్ని ప్రచారం చేసి వాళ్ళను 'ఇంప్రెస్' గావించి ఎలక్షన్లలో గెలవొచ్చుగా''

''అట్లా లాభం లేదండీ. కొందరు నేతల పుణ్యమా అంటూ మన వాళ్లలో వివేకమూ, చైతన్యమూ ఏనాడో నశించాయి. బీదా బిక్కా అంతా మన్నుదిన్న పాముల్లా తయారయి తాత్కాలిక సుఖాలకీ, అవసరాలకీ తప్ప అలవాటు పడలేక పోతున్నారు. ఆఖిరికి విద్యావంతులు కూడా అంతే. రాబోయే తరాలవాళ్ళు సుఖపడాలంటే మన తరంవాళ్ళు కొన్ని త్యాగాలు చేయాలి తప్పదు! అందుకు విప్లవం ఒక్కటే సాధనం।''
నిట్టూర్చాను నేను.

''నిజమే, స్వాతంత్ర్యం సంపాదించటానికి మనవాళ్ళు ఎంతమంది తమనితాము తమకుటుంబాల్ని బలి చేసుకోలేదు?! వాళ్ళంతా బతికొచ్చి ఇవాళొక్కసారి ఈ ప్రభుత్వాన్నీ, ఈ పరిపాలననీ, ఈ కుళ్ళునీ పరికించి చూస్తే తలలు నేలకేసి కొట్టుకుంటారేమొ ఇట్లాంటి దాని కోసమా తామన్ని త్యాగాలు చేసిందీ అని'', అన్నాను.

అన్నాక నాకే ఆశ్చర్య మేసింది అతని భావాలు ఒకటొకటిగా నాకూ తలకెక్కుతున్నాయనిపించింది. నిజానికి నాకీ బాపతు రాజకీయాలంటే అసహ్యం. అతని వాదనల్లో ఎక్కడో నిజమూ, నిజాయితీ ఉన్నాయి...

''మరి మీకు కూడు, గుడ్డ ఇట్లాంటి వాటికి డబ్బు ఎక్కణ్నుంచి వస్తుంది?''
అడిగాను.

''ఎక్కణ్నుంచీ రావు. మీ బోటి సానుభూతిపరుల సహాయ సహకారాలు తప్ప.''

నావి ఒక జత పాంటు, బుష్షర్టు ఉంటే అతణ్ని తీసుకోమన్నాను. మౌనంగా స్వీకరించాడతను.

మాకెదురుగా దండెం మీద మఫ్లరొకటి వ్రేలాడుతోంది. దాన్ని చూపించి విద్యాపతి అన్నాడు.

''మీకది అవసరమా?''

ఆతని ఉద్దేశ్యం నాకు అర్థమైంది, కాని ఆశ్చర్యం కలిగించింది ఏమిటంటే అది వేసవి కాలం ఆతను మట్టుకు ఏం చేసుకుంగాడు??

అదే అడిగాను.

విద్యాపతి లేచి వెళ్ళి దాన్ని తన తలకు చుట్టుకున్నాడు. చెవుల్నీ, చెంపల్లో కొంత భాగాన్నీ, నుదురు సగ భాగాన్నీ కప్పేసుకుంటూ.

"ఇప్పుడు చెప్పండి. నన్నంత తేలికగా గుర్తు పట్టగలరా ఎవరైనా?" అన్నాడు నవ్వుతూ.

పెద్దగా నవ్వేసాను నేను కూడా.

"అయితే తీసుకు వెళ్ళండి.

ఓ రోజు మునిమాపువేళ విద్యాపతి హడావిడిగా మా ఇంటికి వచ్చాడు. రావటమే నన్ను తోసుకుంటూ గదిలోకి లాక్కు వెళ్ళి రహస్యంగా అన్నాడు,

"దగ్గరలో ఎవరూ లేరు కదా?"

గది బయటకు వచ్చి అటూ ఇటూ చూశాను. లోపల ఎక్కడో మావాళ్ళు పనులు చేసుకుంటున్నారు.

"లేదు, ఎందుకు?"

ఈ రాత్రికి ఫణీ భూషణరావును దోచుకోబోతున్నాము."

ఉలికి పడ్డాను.

ఆ రోజు పగలు బాగా ముసురుపట్టి ఉంది రాత్రికి పెద్దగా వర్షం కురవటం ప్రారంభించింది.

పండుకున్నానన్న మాటేగాని ఎంతకీ నిద్రపట్టలేదు. మనసంతా ఎందుకో దిగులుగ మెలాంకొలీ ఆవరించినట్లయింది. ఏం జరగబోతోంది? ఫణీభూషణరావును తల మొండాన్నుంచి వేరయి తెల్లారాక రోడ్డుమీద కనిపించబోతోందా? విద్యాపతి మాటలు గుర్తుకు వచ్చాయి.

"మనుషుల్ని చంపటం మా అభిమతం కాదండీ కాని అవసరం అయితే, అవతలివాడు అందుకు అర్హుడని అనిపిస్తే మాత్రం అతణ్ణి చంపటానికి ఏ మాత్రం సంకో[illegible]బోము. చంపాక అందుగురించి [illegible]చెందం కూడా."

ఫణిభూషణరావు లాంటి మనుషుల్ని దోచుకోవటమే కాదు. ఏ కీలుకాకీలు విరిచి చంపివేసినాగాని ఈ లోకంలో విచారించే మనిషి అంటూ ఉండడనుకుంటాను. నల్లగ, పొడుగాటి ఎలుగుబంటిలా ఉంటాడు ఫణిభూషణరావు. షుగర్ జబ్బుంది అతనికి. మూడుసార్లు మా ఊరి పంచాయతీ ఎలక్షన్లలో నిలబడి ఓడిపోయాడు. కాని అతనికి బయట మాత్రం మంచి పలుకుబడి ఉంది. తియ్యగా కబుర్లు చెప్పటంలో అతను దిట్ట. తండ్రులు తాతలు సంపాదించిన ఆస్తంటూ ఏమీలేదు. మొదట్లో కమ్యూనిష్టులలో పడి జులాయిగా తిరిగేవాడట. అప్పట్లో. తనతోటి కామ్రేడ్స్‌ను కొందరిని అతనే పట్టిచ్చాడనే అంటారు. తర్వాత తర్వాత ఆ ఉద్యమం బలహీన పడితే ప్లేటు ఫిరాయించి ఖద్దరు టోపీ ధరించాడు. మనుషుల్ని మాటల్లో ముంచటంలోనూ, పొలిటిషియన్లకు బ్రోకరుగా పని చేయటంలోనూ, అతణ్ని మించిన వాళ్ళు ఉండరు. అందుకే త్వరలోనే అధికార పార్టీలో పలుకుబడి సంపాదించ గలిగా[illegible]. మా ఊళ్ళోనే ఇద్దరు ముగ్గురు నిరుద్యోగులకు ఉద్యోగాలిప్పిస్తానని చెప్పి వాళ్ళనుంచి డబ్బులు గుంజి మూడేళ్ళు తన చుట్టూ తిప్పుకుని ఆఖరుకు మోచేయి చూపించాడు. చివరలో ఆ నిరుద్యోగులకు తెలిసిందేమిటంటే ఈ మహానుభావుడు తమ ఉద్యోగాల కోసం అసలే ప్రయత్నమూ చేయలేదన్నది! పేదవాడి కోపం పెదవికి చేటు. నోరుమూసుకు కూర్చున్నారు వాళ్ళు. అట్లాంటి వాడు ఫణిభూషణరావు! అతనికి సొంత ఆస్తి అంటూ ఏమీ లేకపోయినా అతనుగాని అతనింట్లోని మరెవళ్ళుగాని ఏపని చేసేవాళ్ళు కాకపోయినా అతను తన ఆడపిల్లలిద్దరికి పెద్ద కట్నాలిచ్చి మంచి సంబంధాలు తేగలిగాడు. ఒక కొడుకు కాకినాడలో "యంబీ" చదువుతోంటే మరోడు బెనారస్‌లో యమ్మెసీకి కూర్చు

(11 వ పేజీ తరువాయి)

న్నాడు... అట్లాంటి వాణ్ని విద్యాపతి వాళ్ళు నిర్జించగలరా? ఎందుకనో నాకెప్పుడూ అన్యాయమే గెలుస్తుందనిపిస్తుంది. అనుభవం నేర్పిన పాఠం అది! ఏది న్యాయం, ఏది అన్యాయం అనే ప్రశ్న ఇక్కడ వద్దు, పదుగురి క్షేమానికి పాటుపడేది ఏదీ అన్యాయం క్రిందికి రాదనుకుంటాను. అట్లాగే పచ్చి స్వార్థంతో చేసేది న్యాయం క్రిందా రాదు...

ఓ రాత్రివేళ మాయావిడ నిద్రలేపుతుంటే మెలుకువ వచ్చింది. అప్పటికి బయట వర్షం కాస్త తగ్గి సన్నగా తుపర పడుతోంది.

ఎక్కడో ఏదో గొడవ జరుగుతుందండి నాకు తెలియటమే ఆలస్యంగ తెలిసింది. నేను బట్టలు మార్చుకుని వెళ్ళేసరికి మరింత ఆలస్యం అయింది. మా యింటికి రెండిళ్ళ అవతల ఉంది ఫణిభూషణరావు భవనం. అప్పటికే పోలీసులు వాళ్ళను తీసుకుపోయారు

"ఎవరికైనా గాయాలు..." పక్కనున్న మనిషిని అడిగాను.

"అదేమీ లేదు, చాలా సింపుల్‌గా పట్టుబడ్డారు"

నేననుకున్నట్లే అయింది. ఫణిభూషణరావుకు అంతకు ముందు రోజే ఆ వార్త తెలిసిందట (ఏ నమ్మక ద్రోహివల్లో!?) పోలీసులు నిర్ణీత స్థలాల్లో మాటువేసి వచ్చిన వాళ్ళను వచ్చినట్లు పట్టుకున్నారట. విద్యాపతినీ, మరో అయిదుగురు ఊళ్ళో కూలి చేసుకు బ్రతికే వాళ్ళనీ "పిటీ" అనిపించింది నాకు. నేనేమీ మాట్లాలేదు. విద్యాపతి నన్ను తరచుగా కలుసుకోవటం కొందరికి తెలుసు...

మర్నాడు కాక ఆ మర్నాడు పేపరులో ఈ వార్త వచ్చింది. మా ఊరి పేరు, ఫణిభూషణరావు ప్రతిష్టలూ అందులో ఘనంగా ఉటంకించబడ్డాయి. నన్ను నిశ్చేష్టుణ్ని చేసిన వార్త ఏమిటంటే ఆ రాత్రి పోలీసులకు విద్యాపతి మనుషులకూ మధ్య కాల్పులు జరిగాయట ఆ కాల్పుల్లో విప్లవవాదుల్లో ముఖ్యుడుగా అనుమానించబడుతున్న విద్యాపతి అనే వ్యక్తి మరణించాడట. దారుణం! ఆ రాత్రి కాల్పులు జరిగినట్లు మా ఊళ్ళో ఎవరూ వినలేదు......

ఏ మాట కామాట చెప్పుకోవాలి, విద్యాపతికి ఘోరమైన అన్యాయం జరిగింది. అతని భావాలు తీవ్రమైనవి కావచ్చు. అతననుసుకున్న మార్గం సవ్యమైనది కాకపోవచ్చు. కాని అతను ఆచరించేదేదో నిస్వార్థంతో ఆచరించాడు అది మట్టుకు ఒప్పుకోకుండా ఉండలేము. లోకంలో అన్యాయం జరుగుతోందనీ, జనమంతా సుఖంగా సమంగా బ్రతకటం లేదనీ, ఆవేశపడి; దీనులకోసమూ దరిద్రుల కోసమూ, దిక్కులేని దౌర్భాగ్యుల బాధాసర్పదష్టుల కోసమూ తపన పడి తన కుటుంబాన్నీ తన సుఖాన్నీ వొదులుకున్నాడతను తను నమ్మిన ఆదర్శం కోసం తననీ తన జీవితాన్నీ త్యాగం చేసుకున్నాడు. ఏ దృష్టితో చూచే వాళ్ళకు వాళ్ళది న్యాయంగా తోస్తుంది. విద్యాపతి నిజానికి నేరస్తుడు కావచ్చు. అతణ్ణి అతని భావాలనీ చూసి ఉలిక్కి పడాల్సిన పనిలేదు. శిక్షించటానికి న్యాయస్థానముంది. అది మర్చిపోరాదు. దానికి రెస్పెక్ట్ ఇవ్వాలి. కాని అట్లాంటి విచక్షణేమీ లేకుండా విద్యాపతి హత్య చేయబడ్డాడు. ఎవరిచేత, ఎట్లాంటి వాళ్ళచేత, అన్నది తలుచుకుంటే వొళ్ళు గగుర్పొడుస్తుంది పిల్లవాడు తప్పుచేస్తే తండ్రి అతణ్ణి శిక్షించవచ్చు. న్యాయంగా భయపెట్టో మరెలాగైనా గానీ, తిరిగి అతనా తప్పు చేయకుండా ఉండేటట్లు! కాని బలముంది కదాని ఎవరూ గమనించరు కదా అని చెప్పి ఇంట్లో కసిదీరా పీకనులిమి పారవేస్తే... ఇంక తండ్రీ బిడ్డల మధ్య బాంధవ్య మెక్కడా?! అందుకే గావచ్చు రావిశాస్త్రి అంటారు:

"తప్పులయితే అందరూ చేస్తారు.
త్యాగాలు మాత్రం కొందరే చేయగలరు"
అయితే ఇక్కడ తప్పు చేసిందెవరూ?
త్యాగం చేసిందెవ్వరు?
విద్యాపతీ, ఐ రెస్పెక్ట్ యూ!!